# మాస్టారుతో ముఖాముఖీ

- డా॥ గోవిందరాజు భరద్వాజ

**1. గురువుగారూ! నమస్కారం. ముందుగా అజో-విభొ-కందాళం వారి సత్కారం అందుకోబోతున్నందుకు మీకు అభినందనలు. మీ జీవిత, నాటక, సాహితీ విశేషాలను గురించి తెలుసుకోవాలని వున్నది.**

జ. థాంక్యూ. రావడం రావడమే పనిలోకా? ఒ.కె. అడుగు.

**2. ముందు మీ బాల్యం, విద్యాభ్యాసం నుంచి మొదలుపెడదాం. వాటి వివరాలు తెలియచెయ్యండి.**

జ. మా పెద్దలది బ్రాహ్మణకోడూరని గుంటూరు జిల్లాలో ఓ పేరుమోసిన గ్రామం. మా తాతగారు ఆ వూరికి చిన్న కరణం. ఆయన సంస్కృతం బాగా చదువుకొని, అది గిట్టక, లౌకికవిద్య నేర్చుకొని కరణంగా ఆ వూరు వచ్చారు. ఆ వూళ్లో ఒక సంస్కృత పాఠశాల నెలకొల్పారట!

మాదిమాత్రం ధూళిపూడి. రేపల్లె తాలూకాలో వుంది. మా నాన్నగారు మొదలి సుబ్రహ్మణ్యశర్మగారు. అమ్మగారు కామేశ్వరమ్మ. ఇద్దరూ దేవతాస్వరూపులే. మా నాన్నగారు B.A., B.Ed. పాసయి ఆ వూళ్లో వున్న తటవర్తి బాపయ్య మిడిల్‌స్కూలుకు వారి ఆహ్వానంమేరకు హెడ్‌మాస్టరుగా వచ్చారు. ఆ స్కూలును సర్వాంగసుందరంగా తీర్చిదిద్ది, 50 మంది విద్యార్థులున్న మిడిల్‌స్కూలును 600 మంది విద్యార్థులున్న హైస్కూలుగా పెంచిపోషించారు.

**3. మాస్టారూ! చిన్నతనంలో మీమీద ఎవరి ప్రభావం ఎక్కువగా వుండేది?**

జ. చిన్నతనంలోనేకాదు, నా జీవితంలో యిప్పటివరకు కూడా నాన్నగారి ప్రభావమే! ఆయన కేవలం హెడ్‌మాస్టరుగారే కాదు ఆరోజుల్లో పదిహేనేళ్లపాటు "Dhulipudi Sarma's Guide to English" అని స్కూల్‌ఫైనల్ విద్యార్థులకు గైడ్‌లు రాసేవారు. ఇప్పటికీ గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో ఆనాటి వారెవరన్నా కనిపిస్తే, "మేం ఆ గైడే చదువుకొని పాసయ్యాం, సార్" అంటారు. ఆయనా రచయితే. కథలు, కవితలు, నాటికలు రాశారు. ఆరోజుల్లో "ఆంధ్రోత్సవాలు" అని ప్రతియేటా జనవరిలో నాన్నగారి ఆధ్వర్యంలో స్కూలులో వుత్సవాలు జరిగేవి. ప్రతిరోజు ఎవరో పెద్దలు మాట్లాడటం, స్కూలుపిల్లల నాటికలు, లలితసంగీతం, వగైరాలతో మాకు సందడేసందడి. అందులో వేసిన, రాసిన నాటకమే నా ప్రథమ ప్రయత్నం. నాకు 13 సం॥. 8వ తరగతి చదువుతున్నాను.

**4. అప్పటినుంచే నాటకాలలో ప్రవేశమన్నమాట! అలా మీరాడిన మొదటి నాటిక ఏది?**

జ. "రాముని బుద్ధిమంతతనం". ఇది శరత్ నవలికకు వేలూరి శివరామశాస్త్రిగారు చేసిన అనువాదం. అది చదివి మా నాన్నగారు నాకుకూడా యిచ్చి 'యీయేడు యిదిరా మీ నాటకం' అన్నారు. కాని తీరాచూస్తే, అది కథ. నాటికగా నాన్నగారు రాయడం అలవాటు. ఆ పని నేనే చేద్దామని ఆరోజు రాత్రంతా కూర్చుని దానిలో వున్న సంభాషణలే నాటకంలోకూడా సంభాషణలుగా రాసి, మర్నాడు పొద్దున నాన్నగారికి చూపించాను. నేను వదిలివేసిన భాగాలను ఎలా ఎక్కడ చేర్చాలో, మరింత నాటకీయంగా చేయడానికి ఏంచెయ్యాలో అన్నీ చెప్పారు.

**5. వింటేనే ముచ్చటవేస్తోంది మాస్టారూ! మా నాన్నగారైతే ఏంరాసినా "ఏడ్చావులే వెధవా! అప్పుడే రాతలూ కూతలూ. చదువుకొని ఏడు" అనేవారు. మీరు అదృష్టవంతులు సార్!**

జ. నిజమే! నాటికకే కాదు, నాచేత భారతంలో, భాగవతంలో ముఖ్యమైన ఘట్టాలన్నీ చదివించారు. నాకు యివ్వాళ తెలుగు యీమాత్రంగానైనా వచ్చిందంటే ఆయన చలవే! నేను తెలుగు ఎం.ఏ.ని కాదు, ఇంగ్లీషు ఎం.ఏ.ని.

**6. మరి మీకు ఆంగ్లవిద్య మీద మక్కువ ఏర్పడడానికి కారణాలు ఏమిటి?**

జ. నేను ఇంజనీరింగ్ చదవాలని నాన్నగారి ఉద్దేశ్యం. ఇంటర్ రెండోసంవత్సరం హిందూకాలేజి, బందరులో. మొదటి సంవత్సరం, రెండో సంవత్సరం కూడా నాటకాలు ఎక్కువై కాలేజీకి వెళ్లడం తగ్గింది. ఆయేడు అటెండెన్స్ లేదని నన్ను పరీక్షకు పంపలేదు.

**7. మరి – ?**

జ. మరి – ఏంలేదు. నాన్నగారికి యింటికి ఉత్తరం వెళ్లింది. ఆయన పరిగెత్తుకుంటూ వచ్చారు. ముందు కాలేజీలో మాస్టర్లని కలిశారు. మీవాడు ఆ నాటికలతో చెడిపోతున్నాడన్నారు. నేను ఆ రాత్రి కన్యాశుల్కంలో మధురవాణిగా బుట్టాయిపేట హాలులో నాటకం వేస్తున్నాను. ఆయన "ఇదేమిట్రా! ఇట్లా చేశావ్?" అన్నారు. నాకు ఆయనను చూడగానే ఏడుపు వచ్చింది. ఏడుస్తున్నాను. ఆయన నా బుజాలమీద చేతులువేసి, "ఏంఫరవాలేదు. ఇంకో సబ్జక్టుతో వచ్చే సంవత్సరం కూర్చోవచ్చునన్నారులే!" అన్నారు.

తండ్రుల్లో ఇంతటి ఔదార్యం, క్షమాగుణం ఆయనలో చూశాను. ఆతరువాత నాకు దగ్గరగా వుండే మాస్టర్లని కలిశాను. ఎం.పి.సి. నుంచి హిస్టరీ, సివిక్స్, ఆప్షనల్ ఇంగ్లీషు గ్రూపుతో చదివి మంచిమార్కులతో పాస్ అయినాను.

**8. అంటే ఆంగ్లం తప్పనిసరై చేరారు?**

జ. అదేంకాదు. మా స్కూలులో ఇంగ్లీషు, తెలుగుల్లో ఎప్పుడూ నేనే ఫస్టు. మా నాన్నగారు నాచేత అప్పటికే చాలా పుస్తకాలు చదివించి పక్కనకూర్చుని అర్థాలు చెప్పేవారు. లేకపోతే తెలియని పదాలకు డిక్షనరీ చూసి అర్థాలు రాసివుంచమనేవారు. అందువల్ల ఇంగ్లీషు అంటే నాకు యిష్టమైన సబ్జక్ట్! ఆతరువాత బి.ఏ., ఎం.ఏలు కూడా ఆంగ్లవిద్య ప్రధానాంశంగానే!

**9. ఆ తరువాత ఆంగ్లవిద్యాబోధన, అధ్యాపకత్వం – వాటి వివరాలు చెప్పండి.**

జ. గుడివాడ కాలేజీలో బి.ఏ. ఇంగ్లీషు పూర్తిచేసి ఎం.ఏ కోసం ఉస్మానియాకు వచ్చాను. అదంతా అనుకోకుండా అలా జరిగిపోయింది. ఎం.ఏ కాగానే యూనివర్సిటీలోనే టెంపరరీ వేకెన్సీలు వేస్తే సెలెక్టయి ఆ వుద్యోగంలో చేరాను. రెండో సంవత్సరం పర్మనెంట్ చేశారు. కాని ఆ యూనివర్సిటీకిందనే వున్న వరంగల్ కాలేజీకి ట్రాన్స్‌ఫర్ చేశారు. వరంగల్లులో ఆరేళ్లు పనిచేశాను. ఆ తరువాత హైదరాబాద్‌లో.

**10. ఇంగ్లీషు విద్యాభ్యాసం, బోధన యివి జరుగుతూ వుండగానే మీరు తెలుగులో రచనలు మొదలుపెట్టారు. 1954 నుంచీ నాటక రచనకు శ్రీకారం చుట్టారు. ఆతరువాత విమర్శన వ్యాసాలు రాశారు. "తెలుగుసాహిత్యం**

**– గాంధీజీ ప్రభావం", "తెలుగు నవలా వికాసం" వంటి ప్రామాణిక రచనలు చేశారు. వాటి వివరాలు చెప్పండి.**

జ. గాంధీజీ శతజయంతికి ఏమన్నా రాయమని చెప్పింది నాన్నగారే! అయితే తెలుగు సాహిత్యంలో అన్ని ప్రక్రియలమీద ఆయన వ్యక్తిత్వ ప్రభావం, సిద్ధాంతాల ప్రభావం చాలావుంది. అసలు మా కుటుంబం అంతా ఖద్దరు వడకటం. ఖద్దరు బట్టలు కట్టడంలో మునిగివుండేది. మా నాన్నగారు 1920 నుంచి ఖద్దరుబట్టలు తప్ప మరొకటి కట్టేవారు కాదు.

ఇహ తెలుగునవలా వికాసం – సంగతి. ఇంగ్లీషు చదువుకున్నానేమో అక్కడవున్న సాహిత్యవిమర్శ, ప్రక్రియావిమర్శ వంటి పుస్తకాలు మనకు లేవే అని మథనపడేవాడిని. దానికి పర్యవసానమే ఆ పుస్తకం.

**11. మరి మీకు అత్యంత ప్రియమైనది నాటకం. ఈ రంగానికి సంబంధించి మీకు ప్రేరణ ఎవరు? అసలు మీకు యీ అభిరుచి ఎలా ఏర్పడింది?**

జ. రెండోప్రశ్నకి ముందు సమాధానం చెబుతాను. ఈ అభిరుచి ఏర్పడ్డానికి మొదటి కారణం నేను పెరిగిన వాతావరణం. నాటకాలు రాసి వేయించేవారు నాన్నగారు; నాటకాలలో మమేకం అయిన మా స్కూలు మాస్టర్లు కారణం. రెండో కారణం నాన్నగారి వెంట తెనాలి వెళ్లి ఆనాటి మహామహుల నాటకాలు చూడడం. మూడో కారణం మా స్కూల్లో ప్రతియేడూ జరిగే ఆంధ్రోత్సవాలు, అందులో మేము వేసే నాటకాలు మరో బలమైన కారణం కూడా ఉండిఉండాలి. నాతోటివాళ్లకన్నా నేను ఒక మెట్టు పైనవున్నాను – అనిపించేలా చేసే నా మనస్తత్వం. అప్పట్లో మాదగ్గర మంచి నటులుండేవారు; పద్యాలు పలికే కుర్రాళ్లుండేవారు. వాళ్లకన్నా గొప్పగా చేశావురా – అని మాస్టర్లు అనాలని నా తపన. అందుకోసం చాలా కృషి చేసేవాడిని.

ఇక మొదటిప్రశ్న. నాకు ప్రేరణ నాన్నగారే! ఆతరువాత వేరువేరు ప్రదేశాల్లో వేరువేరు గురువులు. బెజవాడలో ఏడిద కామేశ్వరరావుగారు. బాలభారతం రేడియోలో పిల్లల కార్యక్రమాలు చేసేవారు. అందులో 36 నాటకాలలో పాల్గొన్నాను, ఒక్క సంవత్సరం. అట్లాగే గుడివాడ కాలేజీలో మాకు యర్రోజు మాధవాచార్యులుగారని – అప్పుడాయన ఆంధ్ర నాటక కళాపరిషత్ కార్యదర్శి – ఎవరినైనా నాటకం మాస్టరుగారిని తీసుకొచ్చి మాకు నాటకంలో శిక్షణ యిప్పించండి అని పోట్లాడాం – ఓ పదిమందిమి ఉండేవాళ్లం. ఆయన బసవరాజు సుబ్బారావుగారని ఒక షేక్స్పియర్ నాటకాలు వేసే నటుడిని మాస్టరుగా కుదిర్చారు. ఆయన శనివారం సాయంకాలం, ఆదివారం వుదయం పాఠాలు చెప్పేవారు.... అంతే! ఆతరువాత గుడివాడలో వుండగానే వీలున్నప్పుడల్లా బెజవాడ వెళ్లి కొప్పరపు సుబ్బారావుగారి దగ్గర చాలా నేర్చుకున్నాను. అంతే! నాటకం నేర్పిన గురువు అంటూ ఉంటే నాన్నగారే! ఇక మిగిలిందంతా మన స్వంత పైత్యమే!

**12. మాష్టారూ! మీ నాటక అధ్యయనం పెంచుకోవడం కోసం విదేశాలకు వెళ్లి నాటకవిద్యను అభ్యసించారు. చాలా అరుదైన విషయం. ఆ వివరాలు చెప్పండి.**

జ. కాని నాకు మొదట్లో విదేశాలకు వెళ్లాలని లేదు. అప్పటికే యూనివర్సిటీలో నాటకాలను ఎమ్.ఏ (ఇంగ్లీషు) విద్యార్థులకు బోధించేవాడిని. కాని నాకు సంతృప్తి లేదు. ఒకపక్కన ఉద్యోగం, సాయంకాలు నాటకాలు. నాటకం పాఠం చెప్పడంలో verbal content కి ప్రాముఖ్యం. కాని నాటకంలో అంతర్లీనంగా ఎన్నో nuances అవి నటనలోను, రంగస్థల కదలికలలోను, మరెన్నిటివల్లనో నాటక అంతర్భావం వ్యక్తం అవుతుంది. అవేవీ

పిల్లలకు చెప్పడంలేదని నా యిబ్బంది. నేను నటించి చూపిస్తే వాళ్లకీ వింతగా ఉండేది. అసలు నాటక ప్రదర్శన విషయంలో యింకా నేర్చుకోవాలని, నన్ను చేర్చుకోమని NSD (National School of Drama) కి అప్లికేషన్ పంపాను. వాళ్లు మీకు 32 ఏళ్లు. మా Age limit 30 ఏళ్లేనన్నారు. అప్పుడు సరాసరి NSD Director ని కలిశాను. ఆయన "మీకు వీలుంటే ఏదైనా అమెరికన్ యూనివర్సిటీకి apply చేయండి" అని చెప్పి, ఆయనే కొన్ని యూనివర్సిటీల అడ్రసులు కూడా యిచ్చారు.

ఇంట్లో అందరూ వ్యతిరేకం. మంచి వుద్యోగం చేతిలో పెట్టుకొని ఎక్కడా వుద్యోగాలు దొరకని నాటకశాఖలో చదవడానికి పోతానంటావ్! అర్థం లేదన్నారు. కాని ఎక్కడో నాకు వెళ్లాలని వుంది. మొత్తం మా కుటుంబ, స్నేహబృంద సభ్యుల్లో నన్ను వెళ్లమని ప్రోత్సహించింది నా శ్రీమతి ఒక్కతే! మా నాన్నగారితో చెప్పాను. "అది చదవడం మంచిది అని తోస్తే తప్పకుండా వెళ్లు. కాని పనికాగానే తిరిగిరా" అన్నారు. అలా వెస్టర్న్ ఇల్లినాయ్ యూనివర్సిటీలో చదివాను. 1 1/2 సం॥ చదువు. ఒక సంవత్సరం అక్కడే వుద్యోగం. అలా జరిగింది నా విదేశీ చదువు.

**13. మరి విదేశాలలో ఎమ్.ఎఫ్.ఏ చేసొచ్చారు. మరి వేరే డిపార్ట్‌మెంట్ పెట్టడం, అక్కడ అధ్యాపక వృత్తి, దానికి ఆచార్యులు కావటం.... యివన్నీ ఎలా సాధించారు?**

జ. నేను అమెరికానుంచి 1974లో తిరిగివచ్చి మళ్లీ ఇంగ్లీషు డిపార్ట్‌మెంటులో రీడర్‌గా కుదురుకున్నాను. నాటకం డిపార్ట్‌మెంట్‌ను ప్రారంభించడానికి ఎనిమిదేళ్లు పట్టింది. ఈలోగా మహజర్లు, పెద్దల్ని కలవటం, మొదలైనవన్నీ జరుగుతూనే వున్నాయి. ఇక్కడ నీకో విషయం చెప్పాలి. ప్రొఫెసర్ జి. రామిరెడ్డి అని – పొలిటికల్ సైన్సులో ఉండేవాడు. నాకు contemporary. నేను అమెరికాలో వున్నప్పుడు రవీంద్రనాథ్ టాగూర్ "సాక్రిఫైస్" అన్న నాటకం చేశాను – అందరూ అమెరికన్ విద్యార్థులు. సితార్, తబల బెంగాలీలు.... దానిని సెలెక్ట్ చేసి పలుచోట్ల ప్రదర్శింపచేశారు American Universities Arts Promotion Council. ఆ నాటకాన్ని షికాగోలో ప్రదర్శించడానికి మేం షికాగో ఎయిర్‌పోర్ట్‌లో దిగాం. వెడుతూవుండగా యీ రామిరెడ్డిగారు తటస్థపడ్డాడు. "ఏమిటి శర్మా! నువ్వు యిక్కడున్నావ్!" అని అడిగాడు. సంగతి చెప్పాను. "నువ్వింకా యీ లల్లాయి పాటలు, యీ వేషాలు మానలేదన్నమాట!" అన్నాడు. "రెడ్డీ! నువ్వు ఖాళీగావుంటే ఎల్లుండి నా నాటకం ఉంది. వచ్చి చూడాలి" అన్నాను. ఆయన అక్కడికి Fulbright scholarship మీద వచ్చాడు. అట్లాగేనని వివరాలు రాసుకున్నాడు.

నాటకం చూశాక బిత్తరపోయి "నాటకం అంటే యిట్లా వుంటుందా శర్మా! బ్రహ్మాండంగా వుంది. మన యూనివర్సిటీలో కూడా పెట్టించాలి" అన్నాడు. "అట్లాగేలే! నువ్వు Vice-Chancellor వి అవుదువుగాని. అప్పుడు పెట్టించవచ్చు" అన్నాను నవ్వుతూ. సరిగ్గా అదే జరిగింది. 8 ఏళ్ల తరువాత Prof. G. Rami Reddy, Vice-Chancellor గా వచ్చాడు. Theatre Arts Dept. వచ్చింది. ఇంటర్వ్యూలు పెట్టారు. నేను ప్రొఫెసర్‌గా ఎంపిక అయ్యాను.

**14. మరి మీరు వచ్చాక, మీ మిగిలిన స్టాఫ్?**

జ. నేను రాగానే మిగిలినవాళ్లని రిక్రూట్ చేసుకోవాలని వైస్‌ఛాన్సలర్‌ని కోరాను. అప్పుడే మద్రాస్‌లో Acting Institute నుంచి Principal గా వుద్యోగవిరమణ చేసిన రాజారాందాస్, ఆంధ్ర యూనివర్సిటీలో పనిచేస్తున్న చాట్ల శ్రీరాములు కావాలన్నాను. అలాగే డెప్యుటేషన్‌మీద చాట్ల, Direct appointment రామదాసు చేరారు. అయితే బయటి experts చాలామంది వచ్చి teach చేసే ఏర్పాటుచేశాను.

**15. మీరు విశ్వవిద్యాలయ స్థాయిలోనే కాకుండా ఇంటర్మీడియట్ స్థాయిలోకూడా నాటకాన్ని అధ్యయనం చేయాలి అని కృషిచేశారు. రెండు పుస్తకాలుగా తీసుకొచ్చారు. కానీ తరువాత ఆశించిన స్థాయిలో ఫలితం కనిపించలేదు. కారణం ఏమిటి?**

జ. అబ్బూరి రామకృష్ణారావు, ఎ.ఆర్. కృష్ణ, కె.వి. గోపాలస్వామి, పి. యస్.ఆర్. అప్పారావుగార్ల నేతృత్వంలో యీ పుస్తకాలు తెచ్చాం. పుస్తకాలయితే తెచ్చాం కాని ఇంటర్‌లో ఆ సబ్జెక్టు పెట్టాలంటే ప్రభుత్వం చెయ్యాలి. పెద్దల్ని కలిశాను. రెండుమూడు మీటింగ్‌లు కూడా అయ్యాయి. మిగిలిన సబ్జెక్ట్‌లానే యీ రంగస్థలశాస్త్రం కూడా ఇంటర్, బి.ఏ.లలో ప్రవేశపెట్టండి. ఎమ్.ఏ.కి విలువ వుండదు అని చెప్పాం. వాళ్లు సవాలక్ష కారణాలు చెప్పి చివరకు ప్రారంభించారు. పోనీ బి.ఏ.లో నన్నా పెడదామని సెంట్రల్ యూనివర్శిటీ, తెలుగు యూనివర్శిటీలలో ప్రారంభించాం. Job opportunities లేవని పిల్లలు రాలేదు. మూడో యేడే మూసివేసే పరిస్థితి. ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోకపోతే యిది సాధ్యంకాదు. యూనివర్శిటీల్లోనూ యిదే యిబ్బంది. ప్రభుత్వం గ్రాంట్ యివ్వాలి. Major courses కి ఇస్తుంది కాని యిటువంటి marginal courses కి యివ్వదు.

**16. మరి దీనికి మార్గాంతరం ఏమిటి మాస్టారు?**

జ. NSD లాగా full-pledged schools పెట్టడమే.

**17. మాస్టారూ! ఇప్పటికే రెండు తెలుగు రాష్ట్రాల్లో అనేక విశ్వవిద్యాలయాలలో రంగస్థల విభాగాలు పనిచేస్తున్నాయి. అయితే వీటన్నిటికి ఆద్యులుగా మీరు ఊహించింది ప్రస్తుతం వాటి స్థితిగతుల్ని గురించి కొంచెం వివరిస్తారా?**

జ. ఒరే! ఒక్కొక్క యూనివర్శిటీది ఒక్కొక్క లక్ష్యం. ఉస్మానియాది అవగాహన కోర్సు. ఆ తరువాత వారు ఏం pursue చేయదలచుకున్నా చేయవచ్చు. సెంట్రల్ యూనివర్శిటీది reference కోసం విద్యార్థుల్ని తయారుచేసే కోర్సు. తెలుగు యూనివర్శిటీది నటుల్ని తయారుచేసే కోర్సు. మరి తెలుగులో అటువంటి పుస్తకాలే లేవు. ఇహ బోధన ఎలా సాధ్యం? పోతే oldest school ఆంధ్రా యూనివర్శిటీ. ఇక్కడ డిప్లొమా కోర్సు. మాస్టర్లు విద్యార్థులు కూడా సీరియస్‌గా వున్నట్లు అనిపించదు. అందువల్ల నలుగురూ కూర్చుని యివ్వాళ ఆంధ్ర, తెలంగాణాలకు ఏరకమైన నాటక బోధన కావాలి అని నిర్ణయించుకోవాలి. ఒకరు నాటక ప్రధానంగా, మరొకరు దర్శకత్వం, ఒకరు సాంకేతిక బోధన, ఒకరు పరిశోధన – యిలా ఏర్పాటుచేసుకోగలిగితే కొంత మేలు. కాని ఒకరినొకరు కలవరు. ఎవరి భేషజాలు వారివి.

**18. గురువుగారూ! ఈ విభాగాలు సరైన రంగస్థల నటులను, సాంకేతిక నిపుణులను తయారుచెయ్యడంలో విఫలం అవుతున్నాయని ఒక విమర్శ. మీరేమంటారు?**

జ. నూటికి నూరుపాళ్లు నిజం. కాని వాటి ధ్యేయం అది కాదే! నటీనటుల్ని, సాంకేతిక నిపుణుల్ని తయారుచెయ్యాలంటే ఉదయం నుంచి సాయంకాలం దాకా పనిచేసే స్కూళ్లు కావాలి. ఈ పార్ట్-టైం టీచింగ్ కాదు. రెండు రాష్ట్రాలలో రెండు NSD వంటి ఇన్‌స్టిట్యూట్స్ పెట్టుకోవాలి. Full-time, professional oriented.

**19. మాస్టారూ! మీరు సెంట్రల్ అకాడమీలో, ఎ.పి. అకాడమీలో కూడా చాలా యాక్టివ్‌గా పనిచేశారు. మరి ప్రస్తుత ఎ.పి., సెంట్రల్ ఎకాడమీల పనితీరుపై మీ అభిప్రాయం? అసలు యీ అకాడమీలు రాష్ట్రస్థాయిలో ఎలా పనిచేయాలంటారు?**

జ. అసోసియేషన్స్‌కు సహాయం విరివిగా చేస్తోందని వింటున్నాను. అప్పుడప్పుడు ఉత్సవాలు నిర్వహిస్తోంది. సమగ్ర ప్రణాళిక వున్నదని తోచదు. నువ్వు అడిగిన రెండో ప్రశ్న చాలా జటిలమైంది. అకాడమీల పని శిక్షణకు, పరిశోధనకు, ప్రచురణకు సాయం చేయడం. రిపర్టరీలు స్థాపించి సరైన పద్ధతిలో వాటిని నడిపించడం. ఫీల్డ్ వర్క్ చేయించి పరిశోధనకు పెద్దపీట వేయడం. శిక్షణ ఎలావుండాలి? అనేది పెద్దల సలహాలతో ఒక బ్లూప్రింట్ తయారుచేసుకోవడం, వర్క్‌షాప్స్ నిర్వహించడం - చాలా పనివుంది చెయ్యవలసినది.

**20. సందర్భం వచ్చిందికాబట్టి అడుగుతున్నాను. మీకు తెలుసు ఇప్పటికే సెంట్రల్ అకాడమి చాలామంది రంగస్థల ప్రముఖులకు దేశంలో అనేక నాటక విద్యాలయాలను మంజూరుచేసింది. మరి మనకు అలా ఎందుకు జరగడంలేదు? లోపం ఎక్కడ?**

జ. 1986లో ఉమ్మడి రాష్ట్రంలో యాక్టింగ్ స్కూల్‌కు నా ప్రపోజల్‌కు ఒప్పుకొని సంగీతనాటక అకాడమి మామూలుగా మిగిలిన చోట్లలోలాగే కొన్ని నియమాలు పెట్టింది. మేము టీచర్స్‌ని, ఇతర స్టాఫ్‌ని నియమిస్తాం. మీరు అవసరమైన బిల్డింగ్స్‌ని, ఫిజికల్ ఎరేంజ్‌మెంట్స్‌ని యివ్వండి అన్నది. నేను ముందు సెక్రటరీ, (కల్చర్)ని కలిశాను. ఆయన మినిస్టర్‌ని కలవమన్నాడు. ఆయన్నీ కలిశాను. ఆయన అప్పటి కమిషనర్, culture ని కలవమన్నాడు. ఆయన నిర్ద్వందంగా No అన్నాడు. కారణం - ఎన్టీ రామారావుగారు center కి against గా రాష్ట్రప్రభుత్వం ఏర్పాటుచేశారు. వాళ్లకు పెద్ద accommodation, infrastructure యివ్వడానికి సుతరామూ ఒప్పుకోరు - అన్నాడు. ఆయన ఎంత కేంద్రప్రభుత్వ వ్యతిరేకి అంటే - "ఒకవేళ రామారావుగారు ఒప్పుకున్నా మేం ఒప్పుకోనివ్వం" అన్నాడు. బతిమాలాము. ఇటువంటి అవకాశం మళ్లీ రాదన్నాను. ఆయన వినలేదు. ఆ ప్రాజెక్టును B.V. Karanth కర్నాటకకు తీసుకుపోయాడు. ఇదీ మన పెద్దవారి నిర్వాకం!

**21. మాస్టారూ! మీరు నాటకరంగానికి సంబంధించి రచనలు చేశారు. శిక్షణ, దర్శకత్వం, అధ్యయనం, అధ్యాపకత్వం - యిలా అనేక రంగాలలో కృషిచేశారు. ఒక తరాన్ని చూశారు. ఇంకో తరాన్ని తయారుచేశారు. అయితే యింకా తెలుగులో మంచి నాటకాలు, రచన - ప్రదర్శనలలో మేలైన రచనలు రావడంలేదని విమర్శ. మరి మీరేమంటారు?**

జ. అలా అనడాన్ని నేను ఒప్పుకోను. మరీ గొప్ప నాటకాలు కాదుగాని ఒకమాదిరి బాగావున్న నాటకాలు. మంచి సబ్జెక్ట్, ట్రీట్‌మెంట్, దర్శకత్వం వస్తూనే వున్నాయి. కాని నాటకం ఆయుస్సు ఒక్క సంవత్సరం మాత్రమే ఉంటే మంచి నాటకం నిలిచేదెట్లా? రెండోది, అసలు మనకు నాటకాలెక్కడున్నాయి. నందిలోనో, మరో పరిషత్తులోనో. అది పైన చెప్పిన పద్ధతి. మనకు నాటికల పరిషత్తులు వచ్చి నాటకాలకు చాలా చెరుపు చేశాయి.

**22. సమకాలీన తెలుగు నాటకరంగం అంటే పరిషత్ నాటకం అంటారు. మరి మీ అభిప్రాయం? వీటి మంచి చెడులను మీరు ఎలా చూస్తారు?**

జ. అలా చెల్లుబడి అవుతున్న మాట వాస్తవం! అదే నిజమని రచయితలు, నటులు, నిర్వాహకులు అనుకుంటూ వుంటే యీ వూబిలోనుంచి బయటపడటం ఎలా? ఇదంతా అమెచూర్ attitude, professional attitude, approach, శిక్షణ, ప్రదర్శన ఉంటేగాని నాటకం యింతకన్న (అంటే middle class melodeamas) బాగుపడదానికి వీలులేదు.

**23. పరిషత్తులో వాసికన్న రాసి పెరుగుతోంది. కొన్ని కోట్లరూపాయలు ఖర్చు అవుతున్నది. అయినా తెలుగు నాటకం రెండు రాష్ట్రాలను దాటి జాతీయస్థాయిలో ఉనికిని చూపించలేకపోతోంది. దీన్ని మీరు ఎలా చూస్తారు?**

జ. పైన చెప్పిన సమాధానమే! అమెచూర్స్ నాటకాలు వేసినంతకాలం మన రాష్ట్రాలు దాటి బయటి నాటకాలతో సమంగా నాటకాలు వేయడం కుదరదు. ఒక నాటకాన్ని ఆరునెలలు రిహార్సలు చేస్తారు. అది సాధ్యమా? సంగీతసాధనకు లక్ష ఖర్చుచేస్తారు. అది మీకు సాధ్యమా? మీరు జాతీయస్థాయి నాటకాలను చూడరు. ఆ స్థాయికి రావాలని మీరే కోరుకోరు.

**24. కాసేపు నాటకం నుంచి ఇతర రంగాలకు వెడదాం. మీరు జానపదకళల్లో విశేషకృషి చేశారు. ముఖ్యంగా puppetry లో. మరి ఆ దిశగా మీకు అభిరుచి ఎలా ఏర్పడింది?**

జ. ఒక విచిత్రమైన సంఘటన. 1968లో బెంగుళూరులో National Festival of Puppetry కమలాదేవి చటోపాధ్యాయ ఆధ్వర్యంలో జరిగింది. ఆంధ్రప్రదేశ్‌కు ఆహ్వానం అందింది. అప్పుడు నేను రాష్ట్ర అకాడమిలో చాలా యాక్టివ్‌గా పనిచేస్తూ వుండేవాడిని. ఇంగ్లీషులో ధారాళంగా మాట్లాడగలిగిన ఏకైక ధీమంతుణ్ణి. ఒక puppet team ని యిచ్చి నువ్వు వెళ్లి present చేసిరా అన్నారు. సరే అన్నాను. తీరా మిగిలినవాళ్లు present చేయడం చూశాను. D.N. Patnaik, G. Venu, Nanjundaiah వంటి సిద్ధహస్తులు. మా programme యివ్వాళ రాత్రికి అయింది. రేపు ఉదయం దీనిమీద సెమినార్. నాకు తోలుబొమ్మలాటను గురించి బొత్తిగా ఏమీ తెలియదు. సభికులడిగిన ప్రశ్నలను తెలుగులో అడిగితే మా బొమ్మలాటవాళ్లు తెలుగులో చెబితే దానిని ఇంగ్లీషులో చెబుతున్నాను. లోపం ఎక్కడో నాకే తెలిసింది. అయిపోయిన తర్వాత కమలాదేవి అన్నారు : "శర్మా! సెమినార్‌లో పాల్గొనాలంటే అక్కడకు వచ్చే scholar performances కన్నా నీకు ఎక్కువ తెలిసుండాలి. నిజానికి బొమ్మలాటవాళ్ల కన్నా ఎక్కువ తెలియాలి!" అన్నారు. అది నాకు కనువిప్పు. A great lesson! తరువాత ఆ తప్పు మళ్లీ ఎన్నడూ చెయ్యలేదు. ఆరోజు రాత్రి బొమ్మలాటలవాళ్లతో ముచ్చటిస్తున్నాను. వాళ్ల పిల్లలు చదువుకోవడంలేదన్నారు. ఇద్దరు పిల్లలు ఏరుదాటుతూ చనిపోవడం వల్ల తల్లిదండ్రులు పిల్లల్ని అవతలివైపు వున్న స్కూలుకు పంపడానికి సిద్ధంగా లేరు. నాకు వెంటనే ఒక ఆలోచన వచ్చింది. వేసవికాలం సెలవులకు మీ ఊరు వచ్చి మీ పిల్లలకి పాఠాలు చెబుతాను, మీరు రాత్రిళ్లు నాకు మీ బొమ్మలాట నేర్పితే - అన్నాను. వాళ్లు సరేనన్నారు. ఆ సంవత్సరం నుంచి మూడేళ్లు ప్రతి వేసవి సెలవులకు నేను, మా ఆవిడ కాకినాడ దగ్గర వున్న మాధవపట్నం వెళ్లేవాళ్లం. నా గురువు అనపర్తి బాలాజీ. గొప్ప పాటగాడు. ఆ మూడేళ్లలో బొమ్మ పట్టుకుని పక్కవాళ్లతో అడుగులు వేస్తూ బొమ్మను ఆడించడం నేర్చుకున్నాను. అంతే!

**25. మరి బొమ్మలాట టీమ్స్‌తో మీరు చాలా విదేశీ యానాలు చేశారు?**

జ. నిజం. ముఖ్యంగా జపాను, ఫ్రాన్సు, గ్రీసు దేశాలు. ఆ దేశాల్లో puppet tradition చాలా ఎక్కువ. UNIMA అనే International puppetry సంస్థ రెండు సంవత్సరాలకొకసారి ఒక్కొక్క నగరంలో Festival చేసేది. దానికి మాకు తప్పనిసరిగా కేంద్రప్రభుత్వం ద్వారా ఆహ్వానం అందేది. సందర్భం వచ్చింది కనుక చెబుతున్నాను. మన తోలుబొమ్మలాట అంటే అక్కడి పిల్లలకు పెద్దలకు ఎంత ఆదరణ అంటే మేము వేసిన ప్రతి show కు standing ovation ! ఇక్కడేమో వాళ్లని బిచ్చగాళ్లుగా చూస్తారు.

**26. మరి మిగిలిన జానపద కళల్లో మీ కృషి?**

జ. 1975 లో రాష్ట్ర సంగీత నాటక అకాడమి జానపద కళోత్సవాలు చేయాలని teams ని select చేయమని నన్ను, నటరాజ రామకృష్ణని కోరింది. ఆంధ్రదేశం నలుమూలల్లో ఉన్న దాదాపు 300 గ్రామాలు తిరిగి ఆ కళాకారుల్ని కలుసుకొని, అటువంటి 750 కళారూపాలను ఆ festival లో present చేశాం. వాళ్లు హైదరాబాద్‌లో ఉన్నపుడు, ఆ తరువాత important teams తో interact అయి 64 కళారూపాలను రాష్ట్రేతర సాధకుల కోసం ఇంగ్లీషులో Folk performing Arts of Andhra Pradesh అనే పుస్తకం రాశాను.

**27. మరి యీ మధ్య గత 20 ఏళ్లుగా కూచిపూడి, యితర నృత్యశైలుల మీద మీరు చాలా కృషిచేశారు... దానిని కొంచెం వివరించండి.**

జ. ఇది కాకతాళీయమే! రాష్ట్ర, కేంద్ర అకాడమీలలో మెంబర్‌గా ఉండటం వల్ల అక్కడ జరిగే నృత్యోత్సవాలలో తప్పకుండా పాల్గొనేవాడిని. అవార్డ్స్ ఎంపిక బాధ్యత ఎక్కువ భాగం వర్కింగ్ కమిటీ సభ్యులమీద ఆధారపడివుంటుంది కనుక (నేను 5 ఏళ్లు కేంద్రఅకాడమీ వర్కింగ్ కమిటీ సభ్యుడిని) అప్పుడు మన కళాకారుల్ని ఇంటర్వ్యూ చేసి అకాడమి సమావేశాల్లో ఆ విషయాలు present చేసేవాడిని. అలా దాదాపు 25 మంది కళాకారులకు అకాడమి గుర్తింపు వచ్చేలా కృషిచేశాను. అప్పుడు నృత్యగురువులతో పరిచయం ఏర్పడింది.

ఆ తరువాత 1993లో కేంద్ర అకాడమి కూచిపూడి ఉత్సవాలు చెయ్యాలన్న ప్రపోజల్ తెచ్చింది. దానికి నా సాయం అడిగారు. అప్పటి Deputy Secretary జయంత్ కాస్త్వార్, నేను, అనూరాధ జొన్నలగడ్డ – సంప్రదింపుల కమిటీలో వున్నాం. ఆ మూడు ఫెస్టివల్స్ కనివినీ ఎరగనిరీతిలో విజయం సాధించాయి. దానితో నృత్యశాఖతో పరిచయం దృఢమైంది.

**28. మరి Nartanam పత్రికను ప్రారంభించి అంత ఉత్తమ పత్రికగా తీర్చిదిద్దారు. దాని స్ఫూర్తి ఎక్కడిది?**

జ. G.M. Sarma గారన్న పెద్దమనిషి నాకు స్నేహితుడు. బొంబాయి. కూచిపూడి నృత్యం అంటే ప్రాణం ఆయనకి. కూచిపూడిమీదనే ఒక quarterly తీసుకురావాలని ఆయన కోరిక. చాలా తప్పించుకోవాలని చూశాను. అది నా ఏరియా కాదన్నాను. నాకు వాటి సంగతులు బొత్తిగా ఏమీ తెలియవన్నాను. ఆయన అన్నింటినీ ఓపికగా తిప్పికొట్టి మీరు మూడు కూచిపూడి ఫెస్టివల్స్‌లో చేసిన కృషిని చూశాను. ఇది మీరు చేయకతప్పదు అన్నాడు. ఒక్క కూచిపూడి మీద అయితే చెయ్యనన్నాను. ఆరునెలల తరువాత అన్ని classical dance styles మీద ఒక quarterly journal తీసుకురావడానికి ఒప్పుకున్న తరువాత నేను Founder - Chief Editor గా Nartanam మొదలుపెట్టాం. 2001–2012 వరకు నేను సంపాదకుడిగా ఉన్నాను. కారణాంతరాల వల్ల నేను బెంగుళూరు వెడుతూ మాకు Asst. Editor గా వున్న మాధవికి ఆ బాధ్యతలు అప్పచెప్పాను.

అందులో ఆ 12 సం॥లలో అంటే 48 సంచికలలో దాదాపు 26 పరిశోధనా వ్యాసాలు రాశాను. తరువాత కూచిపూడి గురువులను గురించిన ఆరు వ్యాసాలు ఆధారంగా, ఇతర ఇంటర్వ్యూలు, ఫీల్డ్ వర్క్ ఆధారంగా 34 మంది కూచిపూడి గురువులను గురించి, వారి సంప్రదాయాల గురించి Kuchipudi Gurus, Performers and Performance Traditions అనే పుస్తకం రాశాను.

**29.** **ఒక వ్యక్తిగతమైన ప్రశ్న మాస్టారూ! మీ ఈ ప్రయాణంలో మీ అర్ధాంగి – మా అమ్మ సరస్వతిగారు – వారి సహకారం, మంచితనం కొంచెం ప్రత్యక్షంగా చూశాం. మరి వారి అభిరుచి, మీకు వారిచ్చిన సహకారం గురించి చెబుతారా?**

జ. చాలా dynamic person. నా విజయానికి మార్గదర్శి. నా పరాజయాలకి నా వెనకవుండి భరోసానిచ్చిన ఆసరా. కుటుంబంలోను, స్నేహబృందంలోను, కళాకారుల లోను, వాళ్ల ఆలనా పాలనా చూడడంలోను ఆవిడదే మొదటిస్థానం. అందరూ బావుండాలని కోరే మంచిమనిషి. ఇంతకుమించి చెప్పకూడదు.

**30.** **ఇప్పటికే చాలా పరిశోధన చేశారు అనేక రంగాల్లో. సమీప భవిష్యత్తులో మీరు మా అందరికోసం రాయబోయే రచనల గురించి చెప్పండి మాస్టారూ!**

జ. చాలా ప్రాజెక్టులున్నాయోయ్. ఎన్ని రాయగలనో తెలియదు. ముఖ్యంగా ఇంగ్లీషులో History of Telugu Drama and Theatre రాయడం నా first priority. తెలుగులో కూడా అది తేవాలని నా కోరిక. Almost అయిపోయిన project తెలుగు నవలాసాహిత్యం – చూద్దాం. ఎన్ని చెయ్యగలనో?

**31.** **తప్పకుండా అన్ని సాధించగలరు మాస్టారూ! మీరు రచయిత, దర్శకులు, ప్రొఫెసర్. అన్నిటినీ మించి మాలాంటి ఎందరికో మార్గదర్శి. ఇవన్నీ మీకు ఎలా సాధ్యం అయ్యాయి మాస్టారూ? మీ విజయ రహస్యం వెనుక ఫార్ములా ఏమిటి? మావంటి వారికి మీరిచ్చే సలహా, భరోసా యేమిటి?**

జ. పెద్ద ఫార్ములా ఏం లేదు. ఒక ధ్యేయం, గురిపెట్టుకొని దీక్షగా పనిచేయడం. ఉస్మానియాలో ఉన్నన్ని నాళ్లు నా విద్యార్థుల కేంకావాలి – వాళ్లకు ఎటువంటి ఉత్తమ నాటకాలను పరిచయం చేయాలి? అనే తపనతో పనిచేశాను. ఆ తరువాత తెలుగువాళ్లు తెలుసుకోవలసిందేమిటి? నా పరిశోధనలో నా దృష్టికి వచ్చిన కొత్త సంగతులను నలుగురితో పంచుకోవడం. అందులో భాగంగానే తెలుగువాళ్ల గొప్పతనం గురించి బయటివాళ్లకు పరిచయం చేయడం. నా ఇంగ్లీషు గ్రంథాలన్నీ అలా వచ్చినవే. మిత్రులందరికీ చెప్పేది ఒకటే! శ్రమలేకుండా ఫలితం దక్కదు. దీక్ష, పట్టుదల, ధ్యేయం, చేస్తున్న పనిమీద శ్రద్ధ లేకుండా మనం ఏమీ చెయ్యలేం. అదే నేను జీవితాంతం నమ్మిన భరోసా.

**32.** **ఇంతసేపు మీ అనుభవాల్ని పంచుకున్నందుకు మీకు కృతజ్ఞతలు. మీరు మరిన్ని నూతన రచనలు, ప్రయోగాలు చేయడానికి మీకు ఆ నటరాజు ఆ శక్తులన్నీ యివ్వాలని కోరుకుంటున్నాను. సెలవు మాస్టారూ!**

జ. సెలవు.